సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

మంగళవారం । 30 । సెప్టెంబర్ । 2025



అర్జీదారులతో కిటకిట

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలను అందజేసేందుకు కలెక్టరేట్ వద్దకు ప్రజలు భారీగా తరలివచ్చారు. వినతులను కలెక్టర్ హిమాన్షు శుక్లాకు అందజేశారు. -8లో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,19,000
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.10,733
మూడు శాతం జీఎస్టీతో	రూ.11,055
నవర (8 గ్రాములు)	రూ.88,440

గరిష్టం/కనిష్టం

33.6 /26.0

వాతావరణం

జిల్లాలో అక్కడక్కడా వర్షం మంగళవారం కురిసే అవకాశం ఉందని వాతావరణ అధికారులు తెలిపారు. గాలిలో తేమ 62 శాతంగా సోమవారం నమోదైంది.

న్యూస్‌రీల్

శ్రామికుల ఈ - కేవైసీని 15లోపు పూర్తి చేయాలి

నెల్లూరు(పొగతోట): ఉపాధి శ్రామికుల ఈ - కేవైసీ ప్రక్రియను వచ్చే నెల 15లోపు పూర్తి చేయాలని డ్వామా పీడీ గంగాభవానీ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శ్రామికులకు ఒకసారి జారీ చేసిన జాబ్‌కార్డు ఐదేళ్ల వరకు అమల్లో ఉంటుందని, ఆపై దీన్ని రెన్యువల్ చేయించుకోవాల్సి ఉంటుందని వివరించారు. దీని కోసం ఫొటోలు తీసి, ఆధార్ సర్వర్‌తో సరిచూసి అప్‌లోడ్ చేయనున్నారని తెలిపారు. దీనికి సంబంధించి సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలను నిర్వహించామని పేర్కొన్నారు. గ్రామాల్లోని శ్రామికులను నెట్‌వర్క్ ఉన్న ప్రాంతాలకు తీసుకెళ్లి ఈ - కేవైసీని పూర్తి చేయాలని కోరారు. ఆయా ప్రాంతాల్లోని అవసరాన్ని బట్టి ప్రక్రియను ఫీల్డ్ అసిస్టెంట్లు, సీనియర్ మేట్లు, మేట్లు సకాలంలో పూర్తి చేయాలని సూచించారు.

తగ్గిన మందుల ధరలు

నెల్లూరు(అర్బన్): జీఎస్టీని కేంద్ర ప్రభుత్వం తగ్గించడంతో దాదాపు అన్ని రకాల మందుల ధరలు తగ్గాయని డీఎంహెచ్‌ఓ సుజాత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరికరాలు, అత్యవసర మందులపై ఉన్న జీఎస్టీని 12 శాతం నుంచి ఐదు శాతానికి తగ్గించారని వివరించారు. శిశువులకు ఉపయోగించే నాప్కిన్లు, లైనర్లు, ఫీడింగ్ బాటిళ్లు, ఆరోగ్య బీమాపై జీఎస్టీ పూర్తిగా తొలగించారని వివరించారు. దీంతో ఆరోగ్య సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. జీఎస్టీ తగ్గింపు ఫలాలు గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అందేలా వైద్యశాఖ అధికారులు, సూపర్‌వైజర్లు, ఆశ కార్యకర్తలు అవగాహన కల్పించాలని కోరారు.

స్పోర్ట్స్ అకాడమీల పునరుద్ధరణకు కృషి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): కరోనా సమయంలో మూసేసిన స్పోర్ట్స్ అకాడమీలను పునః ప్రారంభించేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ కృషి చేస్తోందని రాష్ట్ర ట్రైబల్ స్పోర్ట్స్ ఆఫీసర్, డిప్యూటీ డైరెక్టర్ రమణ పేర్కొన్నారు. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియాన్ని రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ బోర్డు సభ్యురాలు, అంతర్జాతీయ హాకీ క్రీడాకారిణి రజనితో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో అకాడమీలను ఏర్పాటు చేసి క్రీడలను అభివృద్ధి చేయడంలో భాగంగా స్టేడియంలోని వసతులను పరిశీలించామని చెప్పారు. కోచ్‌లు, సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను ఆమె కు తెలియజేశారు. అవసరమైన క్రీడా సౌకర్యాలు, వసతి, క్రీడా పరికరాలు, మౌలిక సదుపాయాలను పరిశీలించి నివేదికను అందజేస్తామని తెలిపారు. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి యతిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో సోమవారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లోని కంపార్ట్‌మెంట్లన్నీ నిండిపోయాయి. కృష్ణతేజ అతిథి గృహం వద్దకు క్యూ చేరుకుంది. స్వామి వారిని ఆదివారం అర్ధరాత్రి వరకు 79,496 మంది దర్శించుకున్నారు. 29,591 మంది భక్తులు తలనీలాలను అర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.79 కోట్లను సమర్పించారు. టైమ్ స్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం లభిస్తోంది. టికెట్లు లేని వారు స్వామిని దర్శించుకునేందుకు 24 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లు కలిగిన వారు మూడు గంటల్లోనే తిరుమలేశుడ్ని దర్శించుకోగలుగుతున్నారు.

చికెన్ వ్యర్థాలతో కాసులు

చేపల గుంతల్లో విచ్చలవిడిగా వినియోగం

- కోవూరు, ఆత్మకూరు, సర్వేపల్లి నియోజకవర్గాల్లో యథేచ్ఛగా..
- అడపాదడపా పట్టుబడుతున్న వాహనాలు
- కట్టడి చేయలేకపోతున్న అధికార యంత్రాంగం
- మాఫియా ఆడిందే ఆట
- ప్రమాదంలో ప్రజారోగ్యం

ప్రజారోగ్యం ఏమైతేనేం.. తమ జేబులు నిండితే చాలన్నట్లుగా మారింది టీడీపీ నేతలు, పోలీసులు, మత్స్యశాఖ అధికారుల వైఖరి. చేపల గుంతల్లో చికెన్ వ్యర్థాలను డంప్ చేస్తూ.. భారీగా కాసులు గడిస్తూ.. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. జిల్లాలోని కోవూరు, ఆత్మకూరు, సర్వేపల్లి నియోజకవర్గాల్లో ఈ తంతు అడ్డూ అదుపులేకుండా సాగుతోంది. వీటిని తరలించే వాహనాలు అడపాదడపా పట్టుబడుతున్నా, కంటపడకుండా తరలుతోంది భారీగానే ఉంటుందని అంచనా. ఇంత జరుగుతున్నా, అధికారులు పట్టించుకోకపోవడం విస్మయాన్ని కలిగిస్తోంది.



చేపల గుంతల్లో చికెన్ వ్యర్థాలను వేస్తూ..

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: జిల్లాలో చికెన్ మాఫియా ఆగడాలు నానాటికీ తీవ్రమవుతున్నాయి. సమీప రాష్ట్రాల నుంచి చికెన్ వ్యర్థాలను జిల్లాకు యథేచ్ఛగా తీసుకొచ్చి.. చేపల చెరువుల్లో డంప్ చేస్తున్నారు. జిల్లాలోని ఆత్మకూరు, సంగం, కోవూరు, ఇందుకూరుపేట, విడవలూరు, ముత్తుకూరు, తోటపల్లిగూడూరు, బుచ్చిరెడ్డిపాళెం, సంగం మండలల్లో దాదాపు రెండు వేల ఎకరాల్లో చేపలను పెంచుతున్నారు.

తక్కువ ధరకే వస్తుండటంతో..

సాధారణంగా చేపలు కిలోపైగా పెరిగేందుకు దాదాపు ఆర్నెల్ల నుంచి ఎనిమిది నెలలు పడుతుంది. రైతుల నుంచి కిలోను రూ.80 నుంచి రూ.90కు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. దీంతో నష్టాలే ఎక్కువగా వస్తున్నాయి. అదే మేతగా బ్రాండెడ్ ఫీడ్‌కు ప్రత్యామ్నాయంగా అతి తక్కువ ఖర్చుతో కూడిన కోళ్ల వ్యర్థాలను చేపలకు ఆహారంగా వినియోగిస్తున్నారు. వీటితో నాలుగు నెలలకే కిలో.. అంతకుమించి బరువు పెరుగుతున్నాయి. దీంతో జిల్లాలో దాదాపు 80 శాతం మంది చేపల రైతులు వీటినే వినియోగిస్తున్నారు. ఫలితంగా తమిళనాడు, కేరళ, కర్ణాటక నుంచి చికెన్ వ్యర్థాలను జిల్లాకు తీసుకొచ్చి విక్రయించే మాఫియా తయారైంది. అక్కడ కిలోను ఐదారు రూపాయలకు కొనుగోలు చేసి ఇక్కడ రూ.15కు విక్రయిస్తున్నారు.

టీడీపీ నేతల కనుసన్నల్లో..

కోవూరు, బుచ్చిరెడ్డిపాళెం, ముత్తుకూరు, పొదలకూరు, తోటపల్లిగూడూరు, సంగం ప్రాంతాలకు చెందిన కొందరు టీడీపీ నేతలు, పోలీస్ అధికారుల కనుసన్నల్లో మాఫియా బరితెగిస్తోంది. పదుల సంఖ్యలో వర్కర్లు వీరికి అండగా ఉన్నారు. ముందుగా బెంగళూరు, చెన్నై, కేరళ ప్రాంతాల్లో చికెన్ వ్యర్థాల సేకరణ కోసం డంపింగ్ యార్డులను ఏర్పాటు చేసుకున్నారు. దీని కోసమే రూ.కోట్లను వెచ్చించారు. అక్కడే కొందర్ని చేరదీసి వారి ద్వారా నిత్యం సేకరిస్తున్నారు. ఆపై రాత్రివేళ లోడ్ చేసి నెల్లూరుకు చేరుస్తున్నారు.

నెలకు రూ.లక్షల్లో మామూళ్లు

ఈ వాహనాలు టోల్‌గేట్లు దాటి జిల్లాలోకి ప్రవేశిస్తున్న సమయంలో కట్టడి చేసే అవకాశం ఉంది. అయినా పోలీసులు, మత్స్యశాఖ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఒక్కో వాహనానికి రూ.పది వేల చొప్పున పోలీస్ శాఖకు నెలవారీ మామూళ్లను ముట్టజెప్పున్నారని తెలుస్తోంది. ఈ రకంగా నెలకు వంద వాహనాలు తిరిగితే స్టేషన్‌కు రూ.పది లక్షల మేర అందుతోందని సమాచారం. సర్కిల్, డీఎస్పీ స్థాయి అధికారులకు సైతం ఇదే పరిస్థితి నెలకొందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో వీటిని ఆపేందుకు ఎవరూ ఉత్సాహం చూపడంలేదు. మత్స్యశాఖ అధికారులకు సైతం నెలకు రూ.లక్షల్లో అందుతోందని తెలుస్తోంది. రోడ్డు ప్రమాదాలు జరిగితేనో.. వాహనం పాడైన సందర్భాల్లోనో ఈ ఉదంతాలు వెలుగులోకి వస్తున్నాయి.

రూ.కోట్లల్లో ఆదాయం

కిలోకు రూ.పది మేర వెచ్చించి.. చేపల చెరువు యజమానులకు రూ.20 నుంచి రూ.30 వరకు విక్రయిస్తున్నారు. ఈ రకంగా చూస్తే జిల్లాలో నెలకు రూ.పది కోట్ల వ్యాపారం జరుగుతోందని సమాచారం. మాఫియాకు భారీగా ఆదాయం వస్తుండటంతో దీనిపై ఎక్కువ మంది దృష్టి సారిస్తున్నారు. అధికార పార్టీ నేతలకు మాఫియా భారీగా సమర్పిస్తోందనే టాక్ ఉంది.

ఆరోగ్యానికి చేటే..


చికెన్ వ్యర్థాలను ఆహారంగా తీసుకునే చేపలను భుజిస్తే ప్రజారోగ్యం ప్రమాదంలో పడుతుందని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో దాదాపు 80 శాతం మంది మాంసాహార ప్రియులు చెరువుల్లో పెంచే చేపలనే తింటున్నారు. ఈ - కోలి బ్యాక్టీరియా చేరి కేన్సర్, జీర్ణకోశ వ్యాధులొచ్చే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.



చికెన్ వ్యర్థాలను తరలిస్తూ పట్టుబడిన వాహనాలు (ఫైల్)

అంతా ఆర్భాటమే..

చికెన్ వ్యర్థాల విషయమై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత రావడంతో కఠిన చర్యలు చేపట్టాలని పోలీస్ శాఖకు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆదేశాలిచ్చారు. నాలుగు నెలల్లో కట్టడి చేయాలని పేర్కొన్నా, అవేవీ అమలుకు నోచుకోవడంలేదు. ఆత్మకూరు నియోజకవర్గంలోని సంగం, ఆత్మకూరు రూరల్ ప్రాంతాలకు చెందిన తెలుగు తమ్ముళ్లు.. మాఫియాలో చేరారు. కొందరు పోలీస్ అధికారులు సహకారం అందిస్తుండటంతో వ్యాపారం సజావుగా సాగుతోంది. అడపాదడపా వాహనాలను పట్టుకున్నట్లు చూపుతున్నారు. ఆత్మకూరు మండలంలోని వాసిలిలో చికెన్ వ్యర్థాల డంపింగ్ కేంద్రాన్ని జనసేన నేతలు చూపి పోలీసులకు పట్టించారు. ఇంత జరుగుతున్నా, పాలకులు ఏ మాత్రం పట్టించుకోవడంలేదు.



సోమశిలకు 34,200 క్యూసెక్కుల వరద

- పెన్నాకు 25,650 క్యూసెక్కుల విడుదల

సోమశిల: సోమశిల జలాశయం నుంచి నీటిని దిగువకు విడుదల చేస్తున్నామని ప్రాజెక్ట్ ఈఈ శ్రీనివాసులు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన మాట్లాడారు. ఎగువ ప్రాంతాల నుంచి 34,200 క్యూసెక్కుల ప్రవహం వస్తోందని చెప్పారు. 7, 8 క్రస్ట్ గేట్ల నుంచి పెన్నాకు 25,650.. కండలేరుకు 4000.. ఉత్తర కాలువకు 100 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నామని వివరించారు. జలాశయంలో 73.246 టీఎంసీలు నిల్వ ఉన్నాయని పేర్కొన్నారు. 99.932 మీటర్ల నీటిమట్టం నమోదైందన్నారు. వరద తగ్గేంత వరకు అప్రాన్ మీదుగా వాహనాలకు అనుమతిలేదని పేర్కొన్నారు.

డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్ల ఆవిష్కరణ



నెల్లూరు సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల కోసం రూపొందించిన డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్లను పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ సోమవారం ఆవిష్కరించారు. చింతారెడ్డిపాళెంలోని తన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అన్యాయానికి గురవుతున్న పార్టీ శ్రేణులకు అండగా ఉండాలనే లక్ష్యంతో దీన్ని ఏర్పాటు చేశారని వివరించారు.

పీహెచ్‌సీల్లో ఓపీ సేవలు బంద్

- వైద్యమందక రోగుల అవస్థలు
- పలు చోట్ల డాక్టర్ల అవతారమెత్తిన నర్సులు
- అవసరమైతే ఎమర్జెన్సీ సేవలనూ నిలిపేస్తామని ప్రకటన



ఉదయగిరి మండలంలోని గండిపాళెం పీహెచ్‌సీలో వైద్యసేవలందిస్తున్న ఏఎన్‌ఎం

నెల్లూరు(అర్బన్): రోగులతో పాటు డాక్టర్లపై కూటమి ప్రభుత్వం కర్కశంగా వ్యవహరిస్తోంది. దీర్ఘకాలంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించకపోవడంతో గతేడాది డాక్టర్లు ఇదే తరహాలో సమ్మెకు పిలుపునివ్వడంతో, చర్చలు జరిపింది. పలు హామీలిచ్చినా, అందులో ఏ ఒక్కటీ నేటికీ పరిష్కారానికి నోచుకోకపోవడంతో ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల సంఘ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఓపీ సేవలు సోమవారం నుంచి బంద్ అయ్యాయి.

ఇదీ పరిస్థితి..

సాధారణంగా కొన్ని పీహెచ్‌సీల్లో 50 నుంచి 60.. మరికొన్ని చోట్ల 70 మంది వరకు రోగులకు ఓపీ సేవలందేవి. అయితే డాక్టర్లు సమ్మెబాట పట్టడంతో పలు ప్రాంతాల్లో ఇది 20కి పడిపోయింది. తొలి రోజే ఇలా ఉంటే రెండో రోజు నుంచి ఆస్పత్రులు ఖాళీ అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. మరోవైపు తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే ఎమర్జెన్సీ సేవలను సైతం నిలిపేస్తామని వైద్యులు స్పష్టం చేశారు.

ఇవీ డిమాండ్లు..

- 20 నుంచి 25 ఏళ్లుగా ఉద్యోగోన్నతుల్లేక ఒకే హోదాలో సేవలందిస్తున్న వైద్యాధికారులకు టైమ్ బౌండ్ ప్రమోషన్లు ఇవ్వాలి.
- ఇన్ సర్వీస్ పీజీ కోటాను పునరుద్ధరించేలా జీఓ నంబర్ 99ను రద్దు చేయాలి.
- నోషనల్ ఇంక్రిమెంట్లను మంజూరు చేయాలి.
- గిరిజన ప్రాంతాల్లో సేవలందిస్తున్న వైద్యులకు 50 శాతం మూల వేతనాన్ని గిరిజన భత్యంగా మంజూరు చేయాలి
- చంద్రన్న సంచార చికిత్స కార్యక్రమానికి రూ.ఐదు వేల భత్యాన్ని ఇవ్వాలి.
- స్థానికత్వం, పట్టణ వైద్యాధికారుల సర్వీస్ అర్హత సమస్యలను పరిష్కరించడంతో పాటు పెండింగ్ అంశాలకు పరిష్కారం చూపాలి.




కలిగిరిలో ఖాళీగా డాక్టర్ కుర్చీ

అగచాట్లు

జిల్లాలోని 52 పీహెచ్‌సీల్లో ఓపీ సేవలను డాక్టర్లు నిలిపేశారు. కొన్ని చోట్ల డాక్టర్లు హాజరైనా, కుర్చీలు ఖాళీ చేసి పక్కకు వెళ్లిపోయారు. మరికొన్ని చోట్ల అసలు వైద్యులే రాకపోగా.. పలు ప్రాంతాల్లో ఆస్పత్రిలో డాక్టర్లున్నా రోగుల వైపు చూడలేదు. విషయం తెలియక హాస్పిటళ్లకు వచ్చిన పలువురు నిరుపేద రోగులు వైద్యమందక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వారి పరిస్థితిని చూసి కొన్ని చోట్ల నర్సులే డాక్టర్ల అవతారమెత్తారు. ఏదో తూతూమంత్రంగా నాలుగు మాత్రలిచ్చి పంపారు.

విద్యుత్ బిల్లులను నేడూ చెల్లించొచ్చు



నెల్లూరు(వీఆర్సీసెంటర్): దుర్గాష్టమి సందర్భంగా సెలవైనా విద్యుత్ బిల్లులను మంగళవారం యథావిధిగా చెల్లించొచ్చని ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్‌ఈ రాఘవేంద్రం సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని బిల్లుల వసూలు కేంద్రాలు యథాతథంగా పనిచేయనున్నాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సచివాలయ ఉద్యోగుల ఆత్మ గౌరవ ర్యాలీ



నినాదాలు చేస్తున్న సచివాలయ ఉద్యోగులు

- అధికారిక వాట్సాప్ గ్రూపు నుంచి వైదొలిగిన వైనం
- ప్రభుత్వ తీరును నిరసిస్తూ నినాదాలు

నెల్లూరు(అర్బన్): తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లాలోని సచివాలయ ఉద్యోగులు కదం తొక్కారు. నగరంలోని వీఆర్సీ గ్రౌండ్స్ నుంచి కలెక్టరేట్ వరకు ప్లకార్డులు చేతబట్టి భారీ ప్రదర్శనను సోమవారం నిర్వహించి ధర్నా చేపట్టారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగుల అసోసియేషన్ల జేఏసీ నేతలు సతీష్‌రెడ్డి, బాలు, పాండురంగ మాట్లాడారు. ఉన్నత చదువులను అభ్యసించి ఎంతో ఆశతో సచివాలయ ఉద్యోగాల్లో చేరామని, తమ సమస్యలను సర్కార్ నెరవేర్చకపోయినా, సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు చేరుస్తున్నామని చెప్పారు. తమ మెడపై కత్తిపెట్టి వలంటీర్ల విధులను చేయిస్తున్నారని ఆరోపించారు. ఇంటింటి సర్వేను చేయాలనడం తగదని, ప్రత్యామ్నాయం చూడకుండా తమ ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసేలా ప్రభుత్వం వ్యవహరించడం దారుణమన్నారు. తమ సమస్యలపై ఉన్నతాధికారులకు వినతిపత్రాలను తరచూ ఇస్తున్నా, ప్రయోజనం లేకపోవడంతో నిరసన బాట పట్టామని వివరించారు. ప్రభుత్వ తీరు మారకపోవడంతో అధికారిక వాట్సాప్ గ్రూపుల నుంచి వైదొలిగామని చెప్పారు. రెండు నోషనల్ ఇంక్రిమెంట్లను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తొమ్మిది నెలల అరియర్స్‌ను చెల్లించడంతో పాటు వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరారు. తమతో చర్చించి సమస్యలను పరిష్కరించాలని, లేని పక్షంలో ఆందోళనలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. నేతలు చైతన్య, గోపాల్, మురళీకృష్ణ, రాజేశ్, శశి, సురేష్, బాలాజీనాయక్, ఫయాజ్, అబీద్, సుమన్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని వృద్ధుడి మృతి

నెల్లూరు(క్రైమ్): పట్టాలు దాటుతున్న గుర్తుతెలియని వృద్ధుడ్ని గురుదేవ్ ఎక్స్‌ప్రెస్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన సౌత్ రైల్వేస్టేషన్ వద్ద సోమవారం చోటుచేసుకుంది. మృతుడి వయస్సు 75 నుంచి 80 ఏళ్ల మధ్య ఉండొచ్చని భావిస్తున్నారు. బ్లూ రంగు ఫుల్ హ్యాండ్స్ చొక్కా, నలుపు రంగు షార్ట్‌ను ధరించి ఉన్నారు. ఘటన స్థలానికి రైల్వే ఎస్సై హరిచందన చేరుకొని పరిశీలించారు. జీజీహెచ్ మార్చురీకి తరలించి ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అభ్యంతరాలుంటే తెలపండి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: ప్రస్తుతం 20 వార్డులుగా ఉన్న బుచ్చిరెడ్డిపాళెం మున్సిపాల్టీని 27 వార్డులుగా విభజించేందుకు నోటిఫికేషన్‌ను పురపాలక శాఖ జారీ చేసిందని కమిషనర్ బాలకృష్ణ సోమవారం తెలిపారు. ఏమైనా అభ్యంతరాలుంటే వచ్చే నెల ఆరులోపు మున్సిపల్ కార్యాలయంలో తెలియజేయాలని కోరారు.

హామీలను విస్మరిస్తున్న ప్రభుత్వం



మాట్లాడుతున్న రాధాకృష్ణయ్య

కోవూరు: కౌలు రైతులకు నూతన చట్టాన్ని తీసుకురావడంతో పాటు అన్నదాత సుఖీభవ పథకాన్ని అందిస్తామని గత ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన టీడీపీ, అధికారంలోకి వచ్చాక విస్మరించిందని కౌలు రైతు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు రాధాకృష్ణయ్య ఆరోపించారు. పడుగుపాడులోని పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘ జిల్లా నాలుగో మహాసభను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడిగా ముత్యాల గురునాథం, కార్యదర్శిగా తుళ్లూరు గోపాల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 27 మంది సభ్యులతో నూతన జిల్లా కమిటీ, తొమ్మిది మంది ఆఫీస్ బేరర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం రాధాకృష్ణయ్య మాట్లాడారు. గుర్తింపు కార్డులను ఇవ్వకపోవడంతో కౌలు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆరోపించారు. సమయానికి యూరియాను అందించాలని గురునాథం డిమాండ్ చేశారు. అనంతరం వివిధ అంశాలపై తీర్మానం చేశారు. రైతు సంఘ నేత చంద్ర రాజగోపాల్, సీఐటీయూ నేత ప్రసాద్, రెహనా బేగం తదితరులు పాల్గొన్నారు.

జగజ్జననీ.. కరుణించు

లోకమాతా కరుణించు అంటూ భక్తుల నామస్మరణతో అమ్మవారి ఆలయాలు మార్మోగాయి. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం జగజ్జనని వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు.
- సాక్షి నెట్‌వర్క్


నెల్లూరు : సరస్వతీదేవి అలంకరణలో రాజరాజేశ్వరి అమ్మవారు


కన్యకాపరమేశ్వరి ఆలయంలో..


మూలాపేటలోని మూలస్థానేశ్వరాలయంలో..


జొన్నవాడలో..


ఇరుకళల పరమేశ్వరి ఆలయంలో చండీ అలంకారం


పెంచలకోనలో విద్యాలక్ష్మి అలంకరణలో ఆదిలక్ష్మీదేవి

విన్నపాలు వినవలె..

- కలెక్టరేట్‌కు పోటెత్తిన అర్జీదారులు
- 500కు పైగా వినతులు


అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

నెల్లూరు(అర్బన్): 'అయ్యా.. మండలాధికారుల చుట్టూ తిరిగినా సమస్యలు పరిష్కారం కాకపోవడంతో జిల్లా కేంద్రానికి వచ్చాం. ఇక్కడైనా మా బాధలు విని స్పందించండి' అని పలువురు అర్జీదారులు కలెక్టర్ హిమాన్షు శుక్లాను కోరారు. సోమవారం నెల్లూరు కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి జనం పెద్ద సంఖ్యలో వచ్చి అర్జీలు సమర్పించారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ అర్జీలు 500కిపైగా వచ్చాయి. కలెక్టర్, జేసీ వెంకటేశ్వర్లు, డీఆర్వో విజయకుమార్, జెడ్పీ సీఈఓ మోహన్‌రావు, డ్వామా పీడీ గంగా భవాని తదితర అధికారులు వినతులు తీసుకున్నారు.


ఒక్క రూపాయి ఇవ్వలేదు



పెరమన గ్రామం సమీపంలో రాంగ్ రూట్‌లో వచ్చిన టిప్పర్ కారును ఢీకొట్టిన ఘటనలో ఏడుగురు మృతి చెందారు. అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, ఇద్దరు మంత్రులు పరామర్శకు రాలేదు. విధిలేని పరిస్థితిలో మృతదేహాలతో న్యాయం చేయాలని ధర్నా జరిపాం. దీంతో ఆర్డీఓ రూ.10 లక్షల నష్టపరిహారం ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని రాతపూర్వకంగా హామీ ఇచ్చారు. అయితే ఇంకా ఒక్క రూపాయి ఇవ్వలేదు. దళిత కుటుంబాల్లో సర్వం కోల్పోయి వీధిన పడిన బిడ్డలకు ఇంటికొక ఉద్యోగం కల్పించాలి. అలాగే నష్ట పరిహారం ఒక్కొక్కరికి రూ.25 లక్షలు అందజేసి ఆదుకోవాలి. కూటమి ప్రభుత్వం స్పందించాలి.

– ధనలక్ష్మి, అశ్విని, సౌందర్య, వెంగమ్మ, వైష్ణవి (మృతుల కుటుంబ సభ్యులు), కాయంపు శ్రీనివాసులు, కత్తి శ్రీనివాసులు (సీపీఎం నాయకులు)

ఇంగ్లిష్ మీడియం దూరం


మాట్లాడుతున్న ఏడుకొండలు

గత ప్రభుత్వంలో పేద విద్యార్థుల అభ్యున్నతి కోసం ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశపెట్టిన ఆంగ్ల మాధ్యమం విద్యను కూటమి ప్రభుత్వం బలహీనపరిచిందని ఇంగ్లిష్ మీడియం విద్యాపరిరక్షణ వేదిక అధ్యక్ష, కార్యదర్శులు దాదినబోయిన ఏడుకొండలు, ఈదర గోపిచంద్ తెలిపారు. ప్రతి జిల్లా తిరుగుతూ గుంటూరు నుంచి వచ్చిన ఏడుకొండలు వినతిపత్రం ఇచ్చి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ట్యాబ్, టోఫెల్ శిక్షణ, బైజుస్ కంటెంట్, సీబీఎస్‌ఈ సిలబస్ తొలగింపు లాంటి చర్యలు చేపట్టిందన్నారు. పేదలకు ఇంగ్లిష్ విద్య అందకుండా కుట్ర చేస్తున్నారన్నారు. తెలుగు మీడియంకు తాము వ్యతిరేకం కాదన్నారు. తెలుగును ఒక భాషగా ఇంటర్, డిగ్రీ వరకు కూడా ప్రవేశపెట్టవచ్చన్నారు. ఇంగ్లిష్ మీడియంలో బోధన చేస్తే ప్రపంచ విషయాలు అర్థమవుతాయన్నారు. విద్యాశాఖ మంత్రి లోకేశ్ స్పందించాలని కోరారు.

దారి లేకుండా కంచె వేశారు



మేము వైఎస్సార్‌సీపీ మద్దతుదారులమని ఇంటికి దారి లేకుండా మున్సిపల్ కౌన్సిలర్ శివారెడ్డి, ఆయన అనుచరులు కంచె వేశారు. సర్వే నంబర్ 198లో ఉన్న గ్రామ పొరంబోకు స్థలాన్ని శివారెడ్డి ఆక్రమించాడు. దీంతో నాలుగు ఇళ్లకు దారి లేకుండాపోయింది. ప్రశ్నిస్తే అధికార పార్టీ అండతో దౌర్జన్యం చేస్తున్నారు. ఆర్డీఓ ఒకసారి, కలెక్టర్‌కు రెండుసార్లు అర్జీలిచ్చాను. వీఆర్వో సర్వే చేయకుండానే చేసినట్టు చూపి అర్జీని ఆన్‌లైన్‌లో క్లోజ్ చేసి మాకు అన్యాయం చేశారు.

– యనమల రాంబాబు, వెంకట్రావుపల్లి, ఆత్మకూరు మున్సిపాలిటీ

న్యాయం చేయాలని వేడుకోలు


సమస్య తెలుసుకుంటున్న రూరల్ డీఎస్పీ శ్రీనివాసరావు

నెల్లూరు(క్రైమ్): సమస్యలపై తక్షణమే స్పందించి న్యాయం చేయాలని పలువురు పోలీసు ఉన్నతాధికారులను వేడుకున్నారు. సోమవారం నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. 78 మంది తమ సమస్యలను వినతుల రూపంలో నెల్లూరు రూరల్, మహిళా పోలీసుస్టేషన్ డీఎస్పీలు ఘట్టమనేని శ్రీనివాసరావు, చెంచురామారావుకు అందజేశారు. వినతులను పరిశీలించిన వారు చట్ట పరిధిలో సత్వరమే సమస్యలను పరిష్కరించాలని ఆయా ప్రాంత పోలీసు అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో లీగల్ సెల్ అడ్వైజర్ శ్రీనివాసులురెడ్డి, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వినతుల్లో కొన్ని..

- చిన్నకుమారుడు పెంచలకృష్ణ ఆస్తి కోసం నన్ను చిత్రహింసలకు గురిచేస్తున్నాడు. తీవ్రంగా కొడుతున్నాడు. విచారించి న్యాయం చేయాలని నెల్లూరు దర్గామిట్ట ప్రాంతానికి చెందిన ఓ వృద్ధుడు కోరాడు.
- నాపేరుపై ఉన్న ఆస్తిని కుమారుడు తీసుకుని ఇంటి నుంచి గెంటేశాడు. తెలిసిన వారి ఇంట్లో తల దాచుకుంటున్నాను. దీనిపై తగిన చర్యలు తీసుకోవాని జలదంకికి చెందిన ఓ వృద్ధురాలు విన్నవించారు.
- పొదలకూరుకు చెందిన శ్రీనివాసులు, హైదరాబాద్‌కు చెందిన రవికుమార్ క్రిప్టో కరెన్సీలో నగదు పెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మించి రూ.8 లక్షలు పెట్టించారు. విచారించగా అదంతా మోసమని తేలింది. నగదు అడిగితే చంపుతామని బెదిరిస్తున్నారని వేదాయపాళేనికి చెందిన ఓ వ్యక్తి ఫిర్యాదు చేశాడు.
- రామ్‌నారాయణ అనే వ్యక్తి కుటుంబ విషయాల్లో జోక్యం చేసుకుని బెదిరింపులకు దిగడంతో స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశా. కేసు నమోదు చేశారు. కేసును ఉపసంహరించుకోవాలని రామ్‌నారాయణ బెదిరిస్తున్నాడని కలువాయికి చెందిన ఓ మహిళ అర్జీ ఇచ్చారు.
- నా పెద్ద కుమార్తె ఉదయగిరి ఆనకట్టలో పడిపోయిన ఘటనపై అక్కడి పోలీసులు కేసు నమోదు చేశారు. ఆమె మృతిపై అనుమానాలున్నాయి. లోతుగా దర్యాప్తు చేసి ఆమె మరణానికి కారకులపై చర్యలు తీసుకోవాలని ఉదయగిరికి చెందిన ఓ తండ్రి కోరారు.
- నాకు ఆరునెలల క్రితం వివాహమైంది. భర్త, అత్తింటివారు అదనపుకట్నం, బంగారు కోసం వేధిస్తున్నారు. అడిగినంత ఇవ్వకపోతే విడాకులివ్వాలని ఇబ్బంది పెడుతున్నారు. కౌన్సెలింగ్ చేసి కాపురాన్ని చక్కదిద్దాలని బాలాజీనగర్‌కు చెందిన ఓ మహిళ కోరారు.

రక్షణ కల్పించాలి : బీజేపీ నాయకురాలు

తన ప్రాణాలకు రక్షణ కల్పించాలని బీజేపీ నాయకురాలు కె.రాజేశ్వరి కోరారు. ఆమె శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పొదలకూరు మండలం మరుపూరు గ్రామంలోని తన పొలంలో వంద టేకుచెట్లను కొందరు గతనెల 26వ తేదీన నరికి తీసుకెళ్లారన్నారు. చంపుతామని బెదిరిస్తున్నారని, వారి నుంచి రక్షణ కల్పించాలని కోరారు. ఈ ఘటనపై పొదలకూరు పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కూటమి ప్రభుత్వంలో భాగస్వామ్యంగా ఉన్న తమకే ఇలా ఉంటే సామాన్య ప్రజల పరిస్థితి ఏంటో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించాలని కోరారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

ఇందుకూరుపేట: మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన ఈ.హరీష్ అనే యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగార్జునరెడ్డి సోమవారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. విజయనగరం జిల్లా సిరిదేవిపురానికి చెందిన హరీష్ కుటుంబం కొన్ని సంవత్సరాలుగా కొత్తూరులో ఉంటోంది. అదే ప్రాంతానికి చెందిన మరో కుటుంబం అతడి ఇంటి సమీపంలో ఉంది. హరీష్ ఆ ఇంట్లోని బాలికను పెళ్లి చేసుకుంటానని నమ్మించి లైంగికదాడి చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేశారు. నిందితుడిని కోర్టుకు హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు ఎస్సై వెల్లడించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృత్యువాత

ఆత్మకూరురూరల్: మున్సిపాలిటీ పరిధిలోని నరసాపురానికి చెందిన మలబంటి మాలకొండయ్య అనే వ్యక్తి ఐఐఎల్ఎఫ్ ఫైనాన్స్ కంపెనీ వేధింపులతో ఈనెల 26న పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి యత్నించాడు. తిరుపతిలో స్విమ్స్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడని ఆత్మకూరు ఎస్సై జిలానీబాషా తెలిపారు. కేసు నమోదు చేశామన్నారు.

చమురు నిక్షేపాల కోసం అన్వేషణ

- ఆందోళన చెందుతున్న గ్రామస్తులు
- తహసీల్దార్‌కు వినతి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

పొదలకూరు: మండలంలోని తొమ్మిది గ్రామాల్లో ఓఎన్జీసీ సంస్థ చమురు నిక్షేపాల కోసం అన్వేషిస్తోంది. మూడురోజులుగా ఈ ప్రాంతంలో బోరు పాయింట్లు వేసి సర్వే నిర్వహిస్తున్నారు. పార్లపల్లి, పొదలకూరు, మరుపూరు, డేగపూడి, నేదురుమల్లి, తాటిపర్తి, వెలికంటిపాళెం, అమ్మవారిపాళెం, అయ్యగారిపాళెం తదితర గ్రామాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ భూముల్లో ఈ ప్రక్రియ కొనసాగుతోంది. వంద అడుగుల లోతు వరకు పాయింట్లు వేసి తర్వాత పేలుడు పదార్థాలు లోపలకు పంపి బ్లాస్ట్ చేస్తారని తెలుస్తోంది. బ్లాస్ట్ చేసిన తర్వాత శాటిలైట్ ద్వారా అన్వేషణకు సంబంధించిన నిపుణులకు అనుసంధానించి భూగర్భంలో చమురు నిక్షేపాలు ఉన్నది లేదని తెలుసుకుంటారు. పీఆర్వో సుధీర్ ఈ ప్రాంతంలో పర్యటిస్తున్నారు. అంతేకాక సంబంధిత వీఆర్వోలకు ముందస్తుగా సమాచారం ఇచ్చినట్టు ఆయన వెల్లడించారు.

రైతుల ఆందోళన

పట్టా భూముల్లో అనుమతి లేకుండా తాము వినియోగిస్తున్న బోర్లకు సమీపంలో వారు బోర్లు వేయడంతో ఇబ్బందులు తలెత్తుతాయని రైతులు అంటున్నారు. తన పొలంలో పది బోర్లు వేసినట్టు ప్రభాకర్ అనే రైతు తహసీల్దార్ బి.శివకృష్ణయ్యకు సోమవారం రాతపూర్వకంగా తెలిపారు. తమ సొంత పొలంలో అనుమతి లేకుండా బోర్లు వేయొద్దని రైతులు వెల్లడించారు. భవిష్యత్‌లో ఇబ్బందులు ఏర్పడితే తాము నష్టపోవాల్సి వస్తుందన్నారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఇబ్బందులు తలెత్తకుండా తాను మాట్లాడతానని వెల్లడించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

తెలుగుదేశం అడ్రస్ గల్లంతు ఖాయం

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి


విలేకరులతో మాట్లాడుతున్న కాకాణి

మనుబోలు: వచ్చే ఎన్నికల్లో జిల్లాలో తెలుగుదేశం పార్టీ అడ్రస్ గల్లంతవడం ఖాయమని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న మనుబోలు మండల కేంద్రానికి చెందిన వైఎస్సార్ వీరాభిమాని, విశ్రాంత ఉపాధ్యాయుడు బాలిరెడ్డి, పిడూరుపాళేనికి చెందిన నాయకుడు గోపిరెడ్డిను సోమవారం ఆయన పరామర్శించారు. ఇటీవల బద్దెవోలు గ్రామానికి చెందిన చల్లా రమణయ్య మరణించగా ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. కాగా ఆయా గ్రామాలకు చెందిన అభిమానులు, నాయకులు కాకాణికి ఘన స్వాగతం పలికారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు వాటిని అరకొరగా అమలు చేసి అంతా చేసేశానంటూ ప్రజల్ని మభ్యపెడుతున్నాడని మండిపడ్డారు. విద్యుత్ చార్జీలను పెంచబోనని హామీ ఇచ్చి తొలి ఏడాదిలోనే రూ.19 వేల కోట్ల భారం మోపడంతోపాటు రూ.923 కోట్లు అక్రమంగా ప్రజల నుంచి వసూలు చేశాడన్నారు. ప్రజల నుంచి లాక్కోవడమే తప్ప ఇచ్చే మనసు బాబుకు రాదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వల్లూరు హర్షవర్ధన్‌రెడ్డి, కసిరెడ్డి ధనుంజయరెడ్డి, చేడిమాల బుజ్జిరెడ్డి, బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, ముంగర రవీందర్‌రెడ్డి, దాసరి భాస్కర్‌గౌడ్, వెంకటశేషయ్య, జానకిరామిరెడ్డి, రమేష్, గిరి, దయాకర్, నవకోటి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

- కలెక్టర్ హిమాన్షు శుక్లా


పోస్టర్లను ఆవిష్కరించిన కలెక్టర్, జేసీ తదితరులు

నెల్లూరు(అర్బన్): అర్జీదారుల సమస్యలకు సకాలంలో పరిష్కారం చూపాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశించారు. పలు అంశాలపై సోమవారం కలెక్టరేట్‌లో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూ సమస్యలు, రెవెన్యూ అంశాలకు సంబంధించిన అర్జీలు పదేపదే వస్తున్నాయని, వాటిని పరిష్కరించాలన్నారు. అర్జీదారులకు తాగునీరు, భోజన వసతి కల్పించడం, అదనంగా పందిళ్లు ఏర్పాటు చేయడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యకలాపాలకు సంబంధించి ఈ – ఆఫీసులో ఫైళ్లను నిర్దిష్ట ఫార్మాట్‌లో పంపాలని సూచించారు. ప్రతి ఫైలుకు ప్రత్యేక క్రమ సంఖ్యను కేటాయించి ఆ నంబర్ మళ్లీ పునరావృతం కాకుండా చూడాలన్నారు.

- జీఎస్టీ 2.0 ఫలాలు ప్రజలకు అందేలా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా రూపొందించిన సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో జేసీ వెంకటేశ్వర్లు, జీఎస్టీ జాయింట్ కమిషనర్ కిరణ్‌కుమార్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

దుకాణానికి వెళ్లొస్తుండగా..

- మహిళ బంగారు గొలుసు అపహరణ

మనుబోలు: దుకాణానికి వెళ్లి తిరిగి వస్తున్న ఓ మహిళ మెడలోని బంగారు గొలుసును ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు లాక్కొని వెళ్లిన ఘటన మనుబోలు కోదండరామపురంలో మెయిన్ రోడ్డుపై సోమవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. విజయలక్ష్మి ఓ దుకాణంలో పనిచేస్తోంది. విధులను ముగించుకుని తిరిగి ఇంటికి వెళ్లేందుకు స్థానిక పద్మావతి కల్యాణ మండపం ఎదురుగా ఉండగా మోటార్‌బైక్‌పై వచ్చిన ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ఆమె మెడలోని ఒకటిన్నర సవర్ల బంగారు గొలుసును లాక్కొని పరారయ్యారు. మహిళ మెడకు స్వల్ప గాయమైంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. కేసు నమోదు చేశారు.

కండలేరులో 57.110 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 57.110 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 5,400 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 590 నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

అగ్నిప్రమాద బాధితులకు అండగా..


నిత్యావసరాలు అందజేస్తున్న పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి

- నిత్యావసర సరుకులు అందించిన ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి


నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని సంతపేట పాత వస్త్ర మార్కెట్‌లో జరిగిన అగ్నిప్రమాదం కారణంగా నష్టపోయిన 30 కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ నెల్లూరు నగర ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి అండగా నిలిచారు. ఆయన సోమవారం బియ్యం, నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వస్త్ర దుకాణాల్లో జరిగిన అగ్నిప్రమాదం వల్ల పేదలు ఎంతో నష్టపోయారన్నారు. 30 షాపులు కాలిపోయాయన్నారు. 8 షాపుల వారు సర్వం కోల్పోయారన్నారు. 22 దుకాణాలు దెబ్బతిని వ్యాపారాలు చేసుకునే పరిస్థితి లేదన్నారు. ఈ ఘటన జరిగిన నాలుగు రోజులవుతున్నా ప్రభుత్వం ఇంత వరకు బాధితులను ఆదుకోకపోవడం వారి నిర్లక్ష్యాన్ని తెలియజేస్తోందన్నారు. నాడు ఇలాంటి సంఘటనలు జరిగితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తక్షణమే స్పందించి బాధితులను ఆదుకున్న సందర్భాలను వివరించారు. అధికార పార్టీ నేతలు కంటి తుడుపు మాటలు చెబుతూ కాలం వెళ్లదీస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం స్పందించి బాధితులు ఒక్కొక్కరికి రూ.2 లక్షలు నష్టపరిహారంగా చెల్లించాలని డిమాండ్ చేశారు. బాధితుల పక్షాన ఉండి కలెక్టర్‌కు జరిగిన నష్టాన్ని వివరించి ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్:	రూ.123
లేయర్	రూ.110
బ్రాయిలర్ చికెన్:	రూ.224
స్కిన్‌లెస్ చికెన్:	రూ.246
లేయర్ చికెన్:	రూ.187

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి : రూ.35
సన్నవి : రూ.20
పండ్లు : రూ.10